సాక్షి
గుంటూరు



మాచర్లలో సీఎం వైఎస్ జగన్ రాక కోసం ఎదురుచూస్తున్న జనం

మంగళవారం । 7 । మే । 2024





మధ్యాహ్నం 1.00 గంటకు పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు తరలివచ్చిన జనసందోహంలో ఓ భాగం(ఇన్‌సెట్‌లో పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ చూపుతున్న ముఖ్యమంత్రి)

జగన్‌కు నీరాజనం

మాచర్లకు పోటెత్తిన జనం • ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం

- మండుటెండలోనూ తగ్గని అభిమానం
- మేమంతా సిద్ధం అంటూ నినదించిన మాచర్ల ప్రజలు
- చంద్రబాబు మోసాల పాలనను వివరించిన ముఖ్యమంత్రి
- ఐదేళ్ల ప్రజాపాలనలో జరిగిన మేలు గుర్తు చేసిన జగన్
- పీఆర్‌కే, అనిల్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపు

అది మిట్ట మధ్యాహ్నం 1.10 గంటల సమయం. ఓ వైపు భానుడి భగభగలు...మరోవైపు ఉక్కపోత...చెమట ధారలుగా కారుతున్నాయ్.. అప్పుడే పల్నాటి గడ్డపై అడుగిడిన అభిమాన నేత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూడగానే ఆ బాధనంతా మర్చిపోయారు. కేరింతలు కొట్టారు. వైఎస్ జగన్ ప్రసంగిస్తున్న సమయంలో నినాదాలు, చప్పట్లు, ఈలలతో పట్టణం మారుమోగింది. మాచర్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారితో పట్టణం జనసంద్రంగా మారింది. వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.



సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. సీఎం బహిరంగసభలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, సీనియర్ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎనుమల మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాచర్ల పట్టణానికి మధ్యాహ్నం 1.10 గంటలకు గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. 1.50 నుంచి 2.20 గంటలకు వరకు ప్రసంగించారు. తరువాత 2.40 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని మచిలీపట్నం బయలుదేరారు.

చంద్రబాబు మోసాలను గుర్తుచేసిన సీఎం

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకొనేవి కాదని, మీరు వేసే ఓటు మీ భవిష్యత్తును, ఐదేళ్లుగా అందిస్తున్న పథకాల కొనసాగింపును నిర్ణయిస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు, పొరపాటున చంద్రబాబుకు ఓటువేస్తే పథకాలన్నీ రద్దు చేసుకున్నట్టేనన్నారు. దీనికి స్పందనగా ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటేస్తామని ప్రజలు స్పందించారు. 59 నెలల పాలనలో లంచాలు, వివక్షలేని పాలన అందించామని సీఎం జగన్ అన్నారు. ఒక్కసారి ఆలోచన చేసి మంచి జరిగితేనే ఓటు వేయాలన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాల పుట్ట అని సీఎం పేర్కొన్నారు. 2014లో ఏం చెప్పాడు, 2014 నుంచి 2019 మధ్య ఎంతటి మోసపూరితమైన పాలన అందించాడో ఒకసారి గుర్తుచేసుకోవాలన్నారు. 2014 మేనిఫెస్టోను చూపించి అందులో రాసిన హామీలు అమలయ్యాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులను చంద్రబాబు నిండా ముంచితే, రైతుభాంధవ ప్రభుత్వంలో అన్ని విధాలా కర్షకులకు మంచి జరిగిందన్నారు. జగన్ ప్రసంగం సమయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రతి మాట శ్రద్ధగా ఆలకించి, ఆయన అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ప్రసంగంలో సీఎం సిద్ధమా.. అనే పిలుపుకు సభికులంతా పిడికిలి బిగించి మేమంతా సిద్ధం అంటూ గట్టిగా నినాదాలు చేశారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ జగన్ ప్రసంగిస్తున్న సమయంలో గొంతు కలిపి బాబుకు వ్యతిరేకంగా నినదించారు.





ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి పీఆర్కేను పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

బ్రహ్మానందరెడ్డి రక్షకుడా... భక్షకుడా మీరే నిర్ణయించండి



పార్టీలు, కులాలకతీతంగా మాచర్ల నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.1,700 కోట్లు సహాయం చేశామనే దమ్ము, ధైర్యం మనకుంది. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, వెన్నుపోటు రాజకీయాలు చేస్తూ ఈరోజు బ్రహ్మానందరెడ్డిని ఇక్కడికి ఇన్‌చార్జిగా పంపించి అనేక రకాల ఫ్యాక్షన్ గొడవలను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నాడు. 2009–2021 డిసెంబర్ వరకు ఇక్కడ ఏ చిన్న గొడవ కాని, ఫ్యాక్షన్ హత్య జరగలేదు. బ్రహ్మానందరెడ్డి వచ్చిన తరువాత పాత గాయాలను రేపుతూ ఒక వర్గం నా వెనుక ఉంటుందనే దురుద్దేశంతో ఫ్యాక్షన్ ను ప్రోత్సహిస్తున్నాడు. బాబు తన పాలనలో దోచిన, దాచిన డబ్బును ఇక్కడ బ్రహ్మానందరెడ్డికి పంపిస్తున్నారు. ఇదే బ్రహ్మానందరెడ్డి తల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1999–2000 కాలంలో ఏడుగురిని కిరాయి మనుషులచే హత్యచేసిన కేసులో ఏ–1గా ఉన్న సంగతి ఈ ప్రాంత ప్రజలు ఇంకా మరువలేదు. ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే నీచమైన చరిత్ర కలిగిన బ్రహ్మానందరెడ్డి ఇప్పుడు కల్లిబొల్లి కబుర్లు చెబుతూ ఈ నియోజకవర్గానికి ఒక రక్షకుడిని అంటూ చెప్పుకుంటున్నాడు. ఇలాంటి కిరాయి హత్యలు చేయించే బ్రహ్మానందరెడ్డి రక్షకుడా...భక్షకుడా అని మీరే నిర్ణయించాలన్నారు. 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టును 8 నెలల కాలంలో పూర్తి చేయడానికి సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారు. మాచర్లలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం, మాచర్ల పట్టణంలోని ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా ప్రాజెక్టుకు రూ.70కోట్లతో పనులు పూర్తి చేస్తాం. ఇన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సీఎం జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు, మాచర్ల నుంచి నన్ను, బీసీ వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపీగా గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు ఓటు వేయాలని కోరుతున్నాను.

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి



జననేతకు అభివాదం చేస్తున్న అభిమానులు

రామకృష్ణారెడ్డి, అనిల్‌ను ఆదరించండి...

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్న మంచివాడు, నాకు మంచి స్నేహితుడని సీఎం జగన్ పేర్కొన్నారు. 'మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు కోరుతున్నాడు. రామకృష్ణారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించండి, రామకృష్ణారెడ్డిని ఇంకా పై స్థాయికి తీసుకుపోతాను. దానితోపాటు తన చేతే వరికపూడిసెల దగ్గరుండి పూర్తి చేయిస్తానని చెబుతున్నాను' అని జగనన్న చెప్పారు.
- అనిల్ నా తమ్ముడు, యువకుడు, ఉత్సాహవంతుడు మంచి చేయడానికి ముందుకు వచ్చాడు. మీ చల్లని దీవెనలు, చల్లని ఆశీస్సులు అనిల్‌పై ఉంచాలని సవినయంగా కోరుతున్నానన్నారు.

జగనన్నకు మీ అందరి చల్లని ఆశీస్సులు ఉండాలి...



దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రతి గడపగడపకు ఆ సంక్షేమ ఫలాలు అందించిన సీఎం జగనన్నకు మీ అందరి చల్లని ఆశీస్సులు దీవెనలు అందించాలి. ఓటమి భయంతో ఏమిచేయాలో తోచక చంద్రబాబు దొంగహామీలను ఇవ్వడం ప్రారంభించాడన్నారు. జగన్ ఒకటి ఇస్తానంటే తాను నాలుగిస్తానని చెబుతున్నాడు. అవసరమైతే కొండమీద కోతిని కూడా ఇస్తానని చెప్పి మళ్లీ మోసం చేయడానికి బాబు మరోసారి వస్తున్నాడు. ఒక ఊరంతా బాగుండాలంటే జగనన్న రావాలి. ఊరిలో కేవలం ఇద్దరే బాగుండాలంటే బాబు రావాలని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని మనసాక్షి ప్రకారం ఓటు వేయాలి. వరికపూడిసెల ప్రాజెక్టుకు సంబంధించి మెయిన్‌ట్యాంక్, పంపు స్టోరేజ్ నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతం టైగర్ ఫారెస్ట్ రిజర్వర్‌లో ఉంది. దీనికి అనుమతుల కోసం సీఎం జగన్ పట్టుపట్టి 2023 నవంబర్ కల్లా అన్ని అనుమతులు వచ్చేలా చూశారు. రానున్న 8 నెలల కాలంలో 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం. జగనన్న ఆశీస్సులతో మొట్టమొదటిసారిగా నరసరావుపేట పార్లమెంట్‌కి ఒక బీసీ అభ్యర్థిగా నాకు అవకాశం ఇచ్చారు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇప్పటివరకు ఎవరూ ఈ అవకాశం ఇవ్వలేదు. ఈ రాష్ట్రంలో జగనన్న బీసీలకు పెద్దపీట వేస్తూ 11 ఎంపీ స్థానాలు ఇవ్వడమే కాకుండా 48 అసెంబ్లీస్థానాలను కేటాయించి తన పెద్ద మనస్సును చాటుకున్నారు.

- అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీ అభ్యర్థి



బస్సు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు పరుగులు పెడుతున్న జనం



సీఎం వైఎస్ జగన్‌కు దిష్టి తీస్తున్న మహిళలు

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై టీడీపీ దుష్ప్రచారం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి



నగరంపాలెం: ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై రాజకీయ లబ్ధి, ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు అరండల్‌పేట 11/3వ అడ్డరోడ్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై టీవీల్లో, వీడియోల్లో, ఐవీఆర్ కాల్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌ను దెబ్బకొట్టాలని టీడీపీ తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. రాష్ట్ర అధికారి ప్రతినిధి డాక్టర్ సయ్యద్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి అబ్రహం లింకన్, జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ చట్టం అమలులో లేదని చెప్పారు. దుష్ప్రచారంతో తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. సమావేశంలో న్యాయవాదులు పచ్చల అనీల్, బి.బాలాజీ, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కాశీం పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామనడం దుర్మార్గం

- ముస్లింలకు మేలు చేసింది నాడు వైఎస్సార్, నేడు జగనన్న
- మతతత్వ పార్టీ బీజేపీతో చేతులు కలిపిన చంద్రబాబు
- ముస్లింలు ఓటు వేసే ముందు ఆలోచించుకోవాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్లు ఎత్తివేస్తామనడం దుర్మార్గమని, అటువంటి పార్టీతో జతకట్టిన చంద్రబాబును ప్రజలు ఓడించడం ఖాయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్‌ల నుంచి సోమవారం ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు స్థానిక శ్యామలానగర్‌లోని మంత్రి నివాసానికి చేరుకుని వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యంగా ముస్లిం సామాజికవర్గం నుంచి భారీ సంఖ్యలో చేరారు. వైఎస్సార్ కల్పించిన రిజర్వేషన్‌ల పుణ్యమా అని ఈ 15 ఏళ్లలో వేలాది మంది ముస్లిం యువతీ, యువకులు ఉన్నత చదువులు చదివి ఉన్నతోద్యోగాలు పొందగలిగారని వివరించారు. ముస్లింలకు మేలు జరగాలంటే జగనన్నకు మద్దతు ఇవ్వాలని, ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

19, 20 డివిజన్ల నుంచి..

నగరంలోని నల్లచెరువు 19, 20 డివిజన్ల నుంచి వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ మైనార్టీ సెల్ సెక్రటరీ షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ షబ్బీర్ (మౌలానా), షేక్ నజీర్, షేక్ సైదా, సాంబయ్య, నాగరాజు, తిరుపాల్, సయ్యద్ రఫీ, జహంగీర్ బాషా, కొరిటపాటి శ్రీను, షేక్ బాషీ, షేక్ బాజీ, షేక్ బద్రుద్దీన్, షేక్ కరిముల్లా, షేక్ జానీ ఉన్నారు. 22వ డివిజన్ శ్రీనివాసరావుపేట నుంచి మాజీ కార్పొరేటర్ షేక్ సైదా ఆధ్వర్యంలో 30 మంది పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ హుస్సేన్, షేక్ ఖాజా, షేక్ జానీ, షేక్ బాజీ, షేక్ అబ్దుల్ రజాక్, షేక్ సైదా, షేక్ జానీ, దుర్గ, శ్రీను ఉన్నారు.

టీడీపీ నుంచి 50 మంది చేరిక

22వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు జగన్‌కోటి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 50 మంది చేరారు. ఆలా నాగమల్లేశ్వరరావు, టి.పిచ్చయ్య, పి.కోటేశ్వరరావు, టి.ప్రసాద్, ఎ.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్‌కే సుభాని, పట్టంశెట్టి నారాయణ, పొదిలాకుల రమేష్, టి.నరేంద్ర, ఆలా కాశి, పట్టంశెట్టి లక్ష్మీనారాయణ, అంబటి శివ తదితరులు చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి రజిని వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

దొంతా బ్రహ్మం ఆధ్వర్యంలో

వైఎస్సార్ సీపీ రెండో క్లస్టర్ కార్యదర్శి దొంతా బ్రహ్మం ఆధ్వర్యంలో స్థానిక 25వ డివిజన్ కు చెందిన 50 మంది కాంగ్రెస్, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు గంటా పూర్ణతో పాటు ఏసోబు, ఆనంద్, ఎర్రంశెట్టి సునీత, నాగరాజు, సతీష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి, చంద్రగిరి ధీరజ్ పాల్గొన్నారు.

టీడీపీ నేత పెమ్మసానికి నోటి దురుసు ఎక్కువ

- దళితుల జోలికి వస్తే తగిన బుద్ధి చెబుతాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు



నగరంపాలెం: దళితుల జోలికి వస్తే టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్‌కి తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరు సమావేశంలో మాట్లాడారు. తాడికొండ మండలం మోతాడకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు పెమ్మసాని నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల నుంచి ఊడిపడిన పెమ్మసాని అక్కడ గన్ కల్చర్‌తో ఏపీలో దళితులపై ప్రయోగించేందుకు మోతాడక గ్రామంలో అవమానించారని ఆరోపించారు. పెమ్మసానికి దిమ్మ తిరిగే కౌంటర్ ఇవ్వనున్నారని చెప్పారు. మోతాడకలో దళితులను కించపరిచేలా దండ వేయకుండా, ఎవడ్రా అపమనేది వ్యాఖ్యానించడం సరికాదన్నారు. టీడీపీలోని దళితులు వ్యతిరేకిస్తే, తప్పని పరిస్థితుల్లో పెమ్మసాని అంబేడ్కర్‌కు దండ వేశారని చెప్పారు. తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ పక్కనే ఉన్నాడని, దీన్ని ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ అవసరం లేదా అని శ్రావణ్‌ను నిలదీశారు. పెమ్మసానితో పాటు దళితులంటే చులకన భావన టీడీపీ డీఎన్ఏలో ఉందని ఆరోపించారు. గతంలో ఎస్సీలుగా ఎందుకు పుట్టాలని చంద్రబాబు, ఎస్సీలు శుభ్రంగా ఉండరని మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, చింతమనేని ప్రభాకర్ మీకెందుకురా రాజకీయాలంటూ ఎద్దేవా చేశారని గుర్తుచేశారు. పెమ్మసానికి నోటి దూల చాలా సందర్భాలాల్లో విన్నామని చెప్పారు. కొల్లిపరలోనూ, సద్దాం హుస్సేన్‌పై చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో సాధికారితతో దళితులు ఉన్నతంగా బతుకుతున్నారని అన్నారు. దళితులు గర్వంగా జీవించేలా చేశారని పేర్కొన్నారు. విజయవాడలో 205 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పేద, బడుగు వర్గాల ప్రజల కోసం వంద శాతం హామీలను అమలు చేస్తున్న దమ్ము, ధైర్యం ఉన్న ఏకైక వ్యక్తి వైఎస్ జగన్ అని అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను వైఎస్ జగన్ అమలు చేస్తునాన్నరని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల బాలల నమోదు చేపట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో సహిత విద్య రీసోర్స్ పర్సన్లు జూన్ 9వ తేదీ వరకు నిర్వహించాలని పేర్కొన్నారు.

మద్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు సహకరించండి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో అక్రమ మద్యం సరఫరా కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీడియా సమావేశ మందిరంలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. అక్రమ మద్యం కారణంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశముందన్నారు. అక్రమ మద్యం అరికట్టేందుకు నిఘా పెంచామన్నారు. ఇప్పటి వరకు 8,325 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. జిల్లాలోని 102 మద్యం రిటైల్ ఔట్‌లెట్లు, 102 బార్లు, 9 క్లబ్స్‌లో మద్యం అమ్మకాలు సరఫరాపై నిరంతరం నిఘా ఉంచుతున్నామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి లైవ్‌ను అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు నిఘాతో పాటు, చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచామని పేర్కొన్నారు. అక్రమంగా నిల్వ చేసే మద్యం పట్టుబడితే సరఫరా చేసిన వారిపైనా చర్యలుంటాయని హెచ్చరించారు. పార్టీల నాయకుల సహకారంతోనే ఇప్పటి వరకు జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొందని, రానున్న వారం రోజులు వారి సహకారం కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, అడిషనల్ ఎస్పీలు రమణ మూర్తి, వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకట రామి రెడ్డి పాల్గొన్నారు.

రూ.3 కోట్లు స్వాధీనం..

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిఘా బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, అక్రమ మద్యం, ఉచిత వస్తువుల విలువ సోమవారం నాటికి రూ.3,17,17,881 చేరింది. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల్లోనూ, వాహనాల తనిఖీల ద్వారా, అందిన సమాచారం తదితర మార్గాల్లో నిఘా బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

తక్కెళ్లపాడులో దారుణహత్య

- అనుమానం.. పెనుభూతమై
- భార్యను రోకలి బండతో కొట్టి హతమార్చిన భర్త



అంజమ్మ(ఫైల్)

పెదకాకాని: అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను రోకలిబండతో కొట్టి హతమార్చిన ఘటన సోమవారం తక్కెళ్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు ఎస్సీ కాలనీకి చెందిన పెనుమాల ఏడుకొండలుకు నరసరావుపేట రూరల్ మండలం పాలపాడుకు చెందిన అంజమ్మతో సుమారు 25 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఏడుకొండలు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా ఏడుకొండలుకు అంజమ్మ వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే అనుమానం. ఈ కారణంగా తరచూ భార్యతో గొడవ పడటం, అసభ్యంగా మాట్లాడటం చేస్తూ ఉండేవాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. నాకు తెలియకుండా మీ అన్నయ్య వద్ద డబ్బులు దాచావు తీసుకురావాలంటూ మొదలైన గొడవ వివాదానికి దారితీసింది. సోమవారం భార్యతో గొడవకు దిగిన ఏడుకొండలు మజ్జిగ చేసుకుంటున్న ఆమెపై రోకలి బండతో దాడి చేశాడు. నిందితుడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. నిందితుడిని వెంటపెట్టుకుని పోలీసులు తక్కెళ్లపాడు గాంధీనగర్‌కు చేరుకున్నారు. అప్పటికే ఇంటికి వచ్చిన కుమారుడు రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని చూసి ఆటోలో తీసుకుని చికిత్స నిమిత్తం గుంటూరు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో తల్లిని పలుకరించే ప్రయత్నం చేశాడు. సమీపంలో ఉన్న మెడికల్ షాపులో గాయాలకు కట్టే గుడ్డ తీసుకుని తలచుట్టూ చుట్టాడు. అప్పటికే తల్లి అంజమ్మ(46) చనిపోయిందని నిర్ధారించుకుని ఇంటికి తీసుకొచ్చాడు. కుమారుడు విజయ్‌ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

నూటికి నూరుపాళ్లు గెలిచేది వైఎస్సార్ సీపీనే

- గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య
- టీడీపీ నాయకులు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన పవన్‌కల్యాణ్
- గుంటూరు తూర్పులో నూరిఫాతిమాను ఎదుర్కోలేక భయపడుతున్న టీడీపీ



మాట్లాడుతున్న కిలారి వెంకటరోశయ్య వేదికపై తూర్పు అభ్యర్థి నూరిఫాతిమా

నగరంపాలెం: టీడీపీ నాయకులు కాగితంపై రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పవన్‌కల్యాణ్ చదివారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య ఎద్దేవా చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమాతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొన్నూరు సభలో ధూళిపాళ్ల నరేంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పిన మాటలు పలికినట్లు చెప్పారు. పొన్నూరులో 25 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ఐదేళ్లల్లో పరుగులు తీయించానని తెలిపారు. ప్రజల నుంచి వారికి ఆదరణ కరువైందని ఆరోపించారు. దిక్కుతోచని పరిస్థితుల్లో పవన్‌కల్యాణ్‌ను తీసుకొచ్చారని, అది కూడా అట్టర్ ఫ్లాప్ అయిందని చెప్పారు. చేబ్రోలులో వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం తగదని హితవు పలికారు. ప్రతిదీ రాజకీయం చేయడం టీడీపీకి అలవాటైందని ఆరోపించారు. గ్లోబెల్ ప్రచారం చేయడంలో చంద్రబాబు కంటే టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మించిపోయారని అన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ తన ఆస్తులు రూ.5,700 కోట్లను ఒక టేబుల్‌పై పెట్టాలని, నా ఆస్తులను టేబుల్‌పై పెడదామని, దీనిపై ఎవరూ మైనింగ్ చేశారనేది చేబ్రోలులో అడుగుదామని, సవాల్‌కు సిద్ధమా అని ప్రశ్నించారు. పదేళ్లల్లో గుంటూరు పార్లమెంట్ ప్రజలు మోసపోయారని మరో సారి మోసపోయేందుకు సిద్ధంగా లేరని చెప్పారు. చంద్రబాబు లాగా పెమ్మసానికి గ్లోబెల్ ప్రచారం చేయడం ఒంటపట్టిందని ఆరోపించారు. వచ్చే గుంటూరు పార్లమెంట్ ఎన్నికల్లో నూటికి నూరుపాళ్లు గెలిచేది తానేనని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ముస్తఫాపై టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శలు చేయడం తగదన్నారు. తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా మాట్లాడుతూ ఆటోనగర్‌లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే ముస్తఫాపై బురద చల్లడమే లక్ష్యంగా టీడీపీ దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. తాము రాజకీయాలు చేసేందుకు వెళ్ళలేదన్నారు. టీడీపీ నేత నసీర్ హెల్ప్ చేసేందుకు రాలేదని అన్నారు. నీచ, శవ రాజకీయాలు చేయడం టీడీపీకి అలవాటుని, త్వరలో ప్రజలు బుద్ధిచెబుతారని చెప్పారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు జియావూర్ రెహ్మాన్, గులాం రసూల్ మాట్లాడారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సువర్ణ పాలన

- రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం
- కిలారి రోశయ్య, అంబటి మురళీకృష్ణలను మెజార్టీతో గెలిపించాలి
- వైఎస్ జగన్ బంధువు సునీత రెడ్డి, సజ్జల లక్ష్మి
- ప్రచారంలో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ



ప్రజలకు అభివాదం చేస్తున్న సునీతరెడ్డి, సజ్జల లక్ష్మి



భారీ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పొన్నూరు: గత ప్రభుత్వాలలో ఎన్నడూలేని విధంగా రాజకీయాలు, పార్టీలకతీతంగా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంట్లో సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని సీఎం వైఎస్ జగన్ బంధువు సునీతరెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సతీమణి సజ్జల లక్ష్మి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రేపల్లె రోడ్డు నుంచి బాపట్ల రోడ్డు మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సువర్ణ పాలన అందిస్తున్నారని అన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఒక్కరికీ మేలు చేకూరిందని చెప్పారు. కరోనా కష్టకాలంలో కూడా వరికీ కష్టం లేకుండా పథకాలను అందించి దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిలిచారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యని గెలిపించాలని కోరారు. ప్రచారంలో అంబటి మురళీకృష్ణ కుటుంబ సభ్యులు ప్రత్యూష, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్‌రాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమూద్, నాయకులు బొనిగల వేణుప్రసాద్, షేక్ నాజర్, వడ్రాణం ప్రసాద్, అమిరినేని సాంబశివరావు, షేక్ మాము, అంబటి వెంకటేశ్వర్లు, ఎందేటి వెంకట సుబ్బయ్య, బోయి నాగరాజు, మొల్ల కరీం, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, గేరా సంజీవ్, కుమారి, షేక్ షర్మిల, దేవరకొండ గోపి, అనీలా కుమారి, మండ్రు అనిత, కె.సుషోభిత, మూర్తి రాజు, షేక్. నయీంబాషా, షేక్ జానీబాషా, సుభాని, దక్కుమల్ల. రవి, గోపిశెట్టి నాగేశ్వరరావు, అల్లం సాంబయ్య పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు రాజ్యాధికారం వైఎస్ జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- హాజరైన అసెంబ్లీ అభ్యర్థి లావణ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట సుబ్బయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్: అణగారిన వర్గాలకు రాజ్యాధికారం వైఎస్సార్ సీపీతో సాధ్యమని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. దుగ్గిరాల గ్రామ ప్రజలు, యానాదుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట సుబ్బయ్య, మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మే 13న మన రాష్ట్రంలో మన భవిష్యత్తు నిర్ణయించుకునే సమయం వచ్చిందని, ఆ రోజు మనందరం ఆలోచించి మనకు మంచిచేసే ప్రభుత్వాన్ని ఎంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగించారని వివరించారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. యండేటి వెంకట సుబ్బయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ గిరిజనులకు అవసరం అయిన సంక్షేమ పథకాలు అందించి, వారి అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. 5 సంవత్సరాల కాలంలో మనకు అన్ని విధాలా మంచి చేసిన జగన్‌కు మనం తోడుగా నిలవాల్సిన సమయం వచ్చిందని, ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌటూరి రమేష్, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు కొమరగిరి సూరిబాబు, రాపూరి గోపి, రాపూరి రాజేష్, కొమరగిరి మరియమ్మ, పొట్లూరి అశోక్, ఇళ్ళ గరటయ్య, బొజ్జ కోటయ్య పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య



మాట్లాడుతున్న కిలారి వెంకట రోశయ్య

కొరిటిపాడు(గుంటూరు): కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య హామీ ఇచ్చారు. గుంటూరు వై జంక్షన్‌లోని లక్ష్మీనారాయణ కోల్డ్‌స్టోరేజ్‌లో మున్నంగి సాంబిరెడ్డి, మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. రోశయ్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. కోల్డ్‌స్టోరేజ్‌లలో పనిచేస్తున్న కార్మికులతో పాటు గుంటూరు మిర్చి యార్డులో పనిచేస్తున్న హమాలీలు, ముఠా కార్మికులు, మిర్చి రైతుల సమస్యలను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత జగనన్నదేన్నారు. 13వ తేదీన నిర్వహించనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్నంగి సాంబిరెడ్డి, మెట్టు కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యకు ప్రతి ఒక్కరూ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కిలారి వెంకట రోశయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిర్చి దిగుమతి వ్యాపారుల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యం, ప్రతినిధులు, అక్కడ పనిచేసే కార్మికులు, మిర్చి యార్డులో పనిచేసే వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.